# సూది—సోది

శీనాయిబుర్ర గిరగిరా తిరుగుతోంది. అంటే భూమి తనచుట్టూ తాను తిరిగినట్టు, మెడమీద గిర్రున తిరుగుతోందనికాదు. కాశీబ్రాహ్మడి బుట్టలో రావణుణ్ని చూచిన సీతబొమ్మలా అటూయిటూ తిరుగుతోందనీ కాదు. అసలు ఆతిరగడం శీనాయిబుర్ర కానేకాదు. అత గాడి బుర్రలోని ఆలోచనలుమాత్రమే.

ఐతే శీనాయిబుర్ర యీరోజే ఏదో మంచి ముహూర్తం చూచుకొని ప్రారంభించలేదు - యీతిరగ డానికి. అది యెప్పుడూఅంతే. అలా ఏదోఒక సమస్యతో గింజుకొంటూనే వుంటుంది. ఎప్పటికప్పుడు సరికొత్త సమస్యలు ఆబుర్రలో పూరుతూనే వుంటాయి.

అసలుదాన్ని 'బుర్ర' అనడంకంటే ఓ'సమ స్యల కార్ఖానా' అనడం తగివుంటుంది.

◆ ◆ ◆ ◆

ఈమధ్య శీనాయి నిత్యమూవచ్చే దినపత్రికలు చూస్తున్నాడు. 'చూస్తున్నాడు' అంటే చూస్తున్నాడనే కాని చదువుతున్నాడనికాదు. శీనాయి పత్రికలుచదవడు. తీరిగ్గాకూచుని విపణివీధితోసహా రాగాలుతీసి చదవడానికి

అది అతగాడి స్వంతమైతేకదూ! ఐనా ఆచూడటం మాత్రింతోనే ఆపత్రికలు మనవాడిబుర్రకి ఓముడిసరుకు నందించాయి.

'ప్రజాస్వామికమంటే ఏమిటి?' అని— పత్రికలు ప్రతిరోజూ చెక్కుతున్నాయి.

—'ప్రజాస్వామికానికి ప్రమాదం' అని—

'ఏమిటో? ఆప్రమాదం!'

'ఏమిటోలేపోనీ' అని వదిలెయ్యగూడదూ? అలావదల్లేదు శీనాయి. శీనాయి వదిలేవాడేమోగాని వాడి బుర్ర అలా వదుల్తుందా! అది సమస్యల కార్ఖానా ఆమెను.

'ప్రజాస్వామికానికి ప్రమాదం'

అదైనా ఏఒకరో అరో అంటున్నదికాదు. ఏ సామాన్యులో అంటున్నదికాదు. అమెరికా అధ్యక్షుడు ట్రూమన్, అట్లీ, పండితనెహ్రూ, లియాఖత్ ఆలీఖాన్, ఆచార్య రంగా, డాక్టర్ పట్టాభి, అంతా — చివరకు మామూలు పోలీస్ ఆఫీసర్ సైతం అదే అంటున్నాడు.

'ప్రజాస్వామికానికి ప్రమాదం' అని-

అలాంటప్పుడు ఆప్రమాదమేమిటో తెలుసుకోకుండా, ఆప్రమాదాన్ని నివారించి ప్రజాస్వామికాన్ని పరిరక్షించకుండా, కూచోడం శీనాయిబుర్రకి చాలా అన్యాయమనిపించింది.

కాని-చేసేదేముంది? కనీసం - ఆ ప్రమాదమే మిటో? ఎవరికో? తెలిస్తేగదూ!

అలా-ఆలోచించగా ఆలోచించగా 'ప్రజాస్వామికం ప్రమాదంలోపడింది.' అంటే - ప్రజాస్వామికం ఏ ముసలమ్మో అయి ఆవిడ కాస్తా కాలుజారిపడిం దేమో! అందుకు వీళ్లంతా "మ్చ్ మ్చ్ మ్చ్" అంటున్నారేమో! అనితట్టింది. మొదట శీనాయికి-

కాని - ప్రజాస్వామికాన్ని పరిరక్షించేందు కంటూ జరుగుతూన్న హంగామా - అట్లాంటిక్ ఫాక్టులూ, పశ్చిమయూరప్ సమైక్యతలూ, జర్మనీ జపాన్ ఫాసిజాలకు పునరాయుధధారణలూ, డాలర్ అప్పులూ యివన్నీ ఓ ముసలమ్మని రక్షించేటందుకేనా.

ఈమధ్య ఉత్తరకొరియాలో ప్రజాస్వామికం ప్రమాదంలోపడడమూ, దాని పరిరక్షణకంటూ అమెరికా సమస్త మిలటరీ బలగాలతో దిగబడడమూ; అప్పటికీ ఆ ప్రమాదం తప్పక మిత్రరాజ్యసమితిలోని చిన్నచిన్న దేశాలూపోయి పీకులాడడమూ; చూచాక — 'ప్రజాస్వామికం - ముసలమ్మకాదు' అని తేల్చుకొన్నది శీనాయి బుర్ర.

"ఐతే మరి...?" మళ్ళీ ఆలోచనకు లంకించు

కున్నది. అనేక దృక్కోణాలనించి పరిశోధనకు దిగింది. శీనాయి బుర్ర...

ప్రజాస్వామికం అంటే 'పప్పూ గోంగూర' కాదుగదా!'– శీనాయికి పప్పుగోంగూర యిష్టం.

ఐతే నాన్నకు కాకరకాయ యిష్టం. అమ్మకు చేపపులుసు యిష్టం. అమ్మ యిష్టం నానకు నష్టం. మా యిద్దరి యిష్టం అమ్మకు కష్టం — కాబట్టి అందరికీ యిష్టంకాని పప్పుగోంగూర ప్రజాస్వామికం ఎలా అవుతుంది?

చర్చిల్‌కు చుట్టలంటే యిష్టం, పట్టాభిగారికి యిన్సూరెన్సు కంపెనీలంటే యిష్టం, రంగాగారికి అనేక సంఘాలు పెట్టడంయిష్టం, నెహ్రూగారికి ప్రకృతిసౌందర్యం మాట్లాడ్డం యిష్టం. యిందులో ఏ ఒకటీ అందరికీయిష్టం కాదు. కాని...ప్రజాస్వామికంమీద అందరికీ మోజేనే–

కాశ్మీర్‌కోసరం కొట్లాడుకునే లియాకత్ నెహ్రూలు; అమెరికావిధానం 'మాకొంప ముంచుతోం దనే బెవిన్, అదే 'సూక్ష్మంలోమోక్షం' అనే అచిన్‌సన్; అందరికీ ప్రజాస్వామికం ప్రియపాత్రమేనే !?–

ఇదేదో నానాత్వంలో ఏకత్వంలాంటి వేదాంతంలావుంది.

బహుశా... సినీమాస్టారేమో! ప్రతీఒక్క 'శచటతప'కి కావాలనిపించే మంత్రిపదవేమో! కనీసం

యం. యల్. ఎ. నేమో ! కాకపోతే సిమెంట్, ఇనుము పర్మిట్లలో ఏదేనాకావడానికీ అవకాశంవుంది. చివరకు బస్‌రూటు పర్మిట్ఐనాకావచ్చు. బ్లాక్ మార్కెట్ అయి తీరుతుంది' —శీనాయిబుర్ర తెగబడ్డది.

'ఐతే వీటికివచ్చిన ప్రమాదమేమిటి ?'

"ఏమీలేదు. కాబట్టి ప్రజాస్వామికంఅంటే యివేవీకావు." సమాధానపడింది.

ఐతే మరి... ?

శీనాయి నాలుగుగోడలమధ్య కూర్చున్నాడు. తలుపులన్నీ మూశాడు. తెరిచాడు. ఆగోడనించీ యీగోడకు అడుగులు లెక్కపెట్టాడు. అంగలు పంగలు వేశాడు.

ఉహూఁ— తెమలలేదు.

ఒక్కవూపులోపోయి వూరివెలపల కాలవకట్ట మీద కూచోబడ్డాడు. నేలమీద గీతలుగీచాడు. కట్ట బీడీలు కాల్చివేశాడు. పెట్టె సిగిరెట్లు పీల్చివేశాడు.

ఉహూఁ — తెమలలేదు.

రఁయ్యిన లేచాడు. సుడిగాలిలాపోయి సూరి ముందు వాలాడు.

యీ వాలకంచూచి భయపడ్డాడు సూరి.

"ప్రజాస్వామికం అంటే ఏమిటి?" విసిరాడు. శీనాయి. ఏదోచెప్పబోయి నీళ్లు నమిలాడు సూరి. "ప్రజాస్వామికం ప్రమాదంలో"

"అందుకే—" గద్దించాడు శీనాయి.

"అంటే-అంటే" యిప్పుడు నీళ్లు నెమరువేస్తున్నాడు సూరి.

"అంటే అంటే కాదు. ప్రజాస్వామికంఅంటే-"

"ఆఁ... ప్రజాస్వామికం అంటే ఎలెక్షన్లు. అంటే ఎన్నికలు— వచ్చే ఎన్నికల్లో ప్రజలంతా మాకు ఓట్లుయిస్తే —"

"యిస్తే—!" రెట్టించాడు శీనాయి.

"అప్పుడు తెలుస్తుంది ప్రజాస్వామికం—" చెప్పాడు సూరి.

"ఎన్నికల్లో —?—" ఎన్నికల్లో తుపాకీ మడమలు ఓటర్లకు యిరువైపులా కదంత్రొక్కడాన్ని గురించి ఆలోచిస్తుంది శీనాయిబుర్ర.

శీనాయి గిర్రున మడమత్రిప్పాడు. సూరి పిడికిలి బిగించి "ఒట్ ఫర్—" అరిచాడు. శీనాయి "సోషలిస్ట్" అనాలని, కాని—

శీనాయి మనస్సుతోపాటు పరుగెత్తలేనికాళ్లని యీడ్చుకుంటూ వెళిపో...తున్నాడు.

పోయిపోయి రామారావునిపిలిచాడు.

రామారావు అంతలావు అదేదో ఉద్గ్రంథంలో నించి కళ్లుపైకెత్తాడు.

"ప్రజాస్వామికమంటే ఏమిటి?"

"మనుష్యుల్లో ముందు భావవిప్లవంవస్తే—ఆనవ్యమానవులు ప్రజాస్వామికాన్ని—"

శీనాయిబుర్ర చిటచిటలాడింది. శీనాయి చిమచిమలాడాడు.

"నీకు బోధపడదు పో—" సెలవిచ్చి మళ్లీ పుస్తకంపేజీల్లో దూరిపోయాడు రామారావు.

అసలిది మనుషులకెవళ్లకి బోధపడేట్టు కన్పించలా శీనాయికి. బుర్రబరువుగో వంగిపోతోంటే—అలానే పోతూ పోతూ — ఎదురైన రంగాచార్యుల్ని అడిగాడు.

"ప్రిజాస్వామికం అంటే ఏమిటి?"

"రైతుకాంగ్రెస్, కూలీకాంగ్రెస్, అంతర్జాతీయ రైలుప్రయాణీక కాంగ్రెస్... యింకా— దేవుడు మేలుచేస్తే —"

మరి ప్రజాస్వామికానికి ప్రమాదంఏమిటి?"

"ఓస్— అదా–? పభుత్వంలో వున్నవాళ్లు పర్మిట్లూ అవీయిచ్చి కాంగ్రెస్ఓట్లు కొనివేస్తున్నారే—అదీ! మాప్రజలకి ఒక్క–పర్మిట్టన్నా యియ్యడంలేదే- అదీ! చివరకు మాప్రజల్ని రాజకీయ బాధితులుగాకూడా ఎంచకుండాచేసి, ఐదెకరాలపొలం ఎగ్గొడుతున్నారే— "

శీనాయి చివరిమాటలు వినసేలేదు. ఏకాఏకీ పోయి గాంధీగారయ్య యింటిముందుపడ్డాడు.

"ప్రజాస్వామికం అంటే ఏమిటి ?"

గౌరయ్య ఒక్కసారి యికిలించాడు. బొర్రి సవరించాడు. ఆ చేత్తోనే బొర్ర సవరించాడు. గట్టిగా సకిలించాడు.

"యిప్పుడు మన కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నదే- అదే- అంతా అదే-"

శీనాయి గిరుక్కున తిరిగాడు.

"కాంగ్రెస్ చేస్తున్నదేమిటి ?"

'కార్డులకీ కవర్లకీ ఖరీదులు పెంచడమా ? 3వ తరగతి రైలుచార్జీలు పెంచి ఒకటోతరగతికి తగ్గించడమా ? ఊళ్ల పేర్లు మార్చడమా ? అధికలాభాలపన్ను ఎత్తివెయ్యడమా ? అమ్మకపుపన్ను పెంచడమా ? ఉన్న కంట్రోళ్లు తీసెయ్యడమా ? లేనికంట్రోళ్లు పెట్టడమా? పదహారూ, ఆరూ మధ్య రేషనింగ్ ఔన్సుల ప్రమాణం ప్రయాణం చెయ్యడమా? ... వగైరా యివన్నీనా? యిందులో ఏఒకటన్నానా?...

దారం తెగిన గాలి పడగలా పోతున్నాడు. శీనాయి కాఫీహోటల్లో ఉదయంపూట దిగే ఇడ్లీవాయిల కంటే జోరుగా దిగుతున్నాయి. శీనాయిబుర్రలో ఆలోచన్లు- అడ్డమైనవాళ్లనల్లా అడుగుతున్నాడు.

"కాంగ్రెస్ చేస్తున్నదేమిటి ?"

"కల్లుసారాలమీద నిషేధం అనడం. మా పొట్టకు తిండి నిషేధంపెట్టడం." చెప్పాడు గౌడగణపాయి.

"కొనబోతే కొరివి. అమ్మబోతే అడివి" అన్నాడు ఓరైతు.

"జీవితప్రమాణం పెరగడం-జీతాలు తరగడం-చెప్పాడు ఓగుమస్తా—

"కూలీ పెంచండి! అంటే జైళ్లు, తుపాకులూ పెంచడం-"

యిలా... యిలా...

"యిదే ప్రజాస్వామికమైతే దీనికి ప్రమాదమొస్తే ఏం?" తర్జనభర్జనల్లో పడింది శీనాయిబుర్ర.

ఈ ఆలోచనవచ్చేసరికి శీనాయికి కాంగ్రెస్ ప్రభుత్వం జైళ్లూ తుపాకులూ విరుచుకుపడ్డట్టయింది — తనమీందే.

ఊహూం — యిదీ తేలలేదు. శీనాయికి ఏదైనా అంతే —

ఆవేళటి పత్రికల్లో మరోవిషయం కనిపించింది పెద్ద అక్షరాల్లో —

ఐతే... అవి తాటికాయలంతవున్నాయా? కొబ్బరికాయలంతవున్నాయా?' అని ఆలోచించడంతో కొంతకాలం వృథాఐపోయింది. ఐనా —

"కమ్యూనిజం ప్రజాస్వామికానికి పరమ

శత్రువు'' అంటూన్న ఆ తాటికాయలు లేక కొబ్బరి కాయలు శీనాయి పరిశోధనకి బహుగా వుపయోగ పడేట్టున్నాయి. 'కమ్యూనిజం' అంటే ఏమిటో తెలిస్తే దానికి వ్యతిరేకమంతా 'ప్రజాస్వామికం' అని చెప్పేసెయ్యొచ్చు. అప్పుడు దానికొచ్చిన ప్రమాదాన్ని అట్టేకని పెట్టెయ్యొచ్చు. అందుకు అలాగ్గా నడుం కట్టెయ్యొచ్చు.

యిక ''ప్రజాస్వామికం అంటే యేమిటి?'' అన్న విషయం వదిలి ''కమ్యూనిజం అంటే యేమిటి?'' అని లంకించుకుంది శీనాయిబుర్ర.

కాని ఎవరి నడుగుతాడు —

మొదట దొరికి జైళ్లల్లో వున్నవాళ్లూ, తర్వాత దొరికి స్వర్గంలో వున్నవాళ్లూపోగా — యిక అసలు దొరకని కమ్యూనిస్టులకోసం వెతకాలి. ఐనా అంతలేసి మిలిటరీబడ్జెట్లకే అంతుదొరకనివాళ్ళకోసం ఆరాటపడటం వృధా అనుకున్నాడు. శీనాయి.

మరైతే...ఎలా?

అమాంతంగా శీనాయికి ఆ వూళ్లో కామ్రేడ్ కోటిగాడు వూరేగింపుల్లో చించుకున్న గొంతువినిపించింది.

''ఆఁ! అదే కమ్యూనిజం.'' నిర్ధారణచేశాడు శీనాయి. ''దానికి వ్యతిరేకమే ప్రజాస్వామికం–'' తేల్చేసింది శీనాయిబుర్ర.

*    *    *

తీరిగ్గా కూచున్నాడు శీనాయి. స్థిమితంగా ఆ కేకల్ని నెమరుకు తెచ్చుకొంటోంది శీనాయిబుర్ర.

"అందరికీ తిండి కావాలి"

"అందరికీ బట్టకావాలి"

"అందరికీ పనికావాలి"

"దున్నే వాడికే భూమికావాలి"

"విశాలాంధ్రలో ప్రజారాజ్యంకావాలి"

"యిదీ కమ్యూనిజం" నిర్ధారణచేశాడు శీనాయి. ఐతే —

"అందరికీ తిండీ, బట్టా, పనీ అక్కర్లేదు"

"దున్నే వాడికి భూమి అక్కర్లేదు"

"విశాలాంధ్రలో ప్రజారాజ్యం అక్కర్లేదు"

"ఇదీ ప్రజాస్వామికం" తేల్చేసిందిశీనాయిబుర్ర.

"ఐతే— దీనికి ప్రమాదంవస్తేమాత్రమేం?"

శీనాయిబుర్ర తుకతుకలాడింది.

శీనాయి తుపానులా ఝుఁయ్యిమన్నాడు.

"ప్రజాస్వామికం అంటే యిదేమిటే? యిలా తయారయింది." జనం - కూడూ గుడ్డా, దున్నుకోడానికి చారెడు నేలా, చేసుకోడాని కింతపని కావాలంటారు.

"అంటే, నోళ్లు నొక్కేసి జైళ్లల్లో కుక్కేస్తామంటారు. వీరు —

తొంభై

అయితే గియితే — తిండీ, గుడ్డా, భూమీ, పనీ కావాలనటం ప్రిజలంతా అంటారు. కనుక అది ప్రిజాస్వామికం కావాలి.

అదేఅయితే, యీా నోళ్లునొక్కే కాంగ్రిసూ, గాంధీ గారయ్యా వగైరా వగైరాల చేతుల్లో — ప్రిజాస్వామికానికి నిజంగానే ప్రిమాదం వచ్చింది.

''అరె! ప్రిమాదం తెచ్చేవాళ్లే 'ప్రమాదం, ప్రిమాదం' అని తెగఅరుస్తారేం!''

యిది — దయ్యాలు వేదాలువల్లించడమా?
తుపాకీలు అహింస జపించడమా?

యిప్పుడు శీనాయి సీరియస్ అయ్యాడు.

అలా అలా– 'కిమ్మ'నకుండా తిరుగుతున్నాడు. 'కిమ్మ'ంటే కమ్యూనిస్ట్ అంటాయేమో గాంధీటోపీపెట్టుకున్న తుపాకీలు — అన్న భయంతో —

---